ఇంటర్వ్యూ

జయశేఖర తిరుమలరావ్

సాయంకాలం నీరెండలో సూర్య కాంతిక మెరిసిపోతున్న 'సరళ భవన్' గేటు ముందు ఓ యువకుడు లోనికి వెళ్ళడంకోసం సంకోచిస్తూనే ధైర్యంచేసి ప్రవేశించాడు.

ఆరడుగుల ఎత్తు, పచ్చని ఛాయతో మిసమిస లాడే ఒళ్ళు, ఎదుటి మనిషి లోతుల్ని చదివేస్తున్నవా అన్నట్లుండే కళ్ళు, నిటారైన ముక్కు, ప్రక్కకు దువ్విన క్రాపు — ఒక్కసారిచూస్తే చాలు ఆకర్షించే మూర్తి అతనిది. కాని, మాసి, నలిగిన బట్టల్లో అతడు మాసిపోయిన పాత నోటులా వున్నాడు.

బయట వరండాలో గాంభీర్యాన్ని ఓ మూల కట్టివేసినట్లుంది — ఆల్సేషన్ కుక్క. బిక్కు బిక్కుమంటూ దిక్కులుచూస్తూ నిలబడ్డాడతను. కుక్క లేచి నిలబడింది. దిక్కులు పిక్కటిల్లేట్లుగా అరవలేదు. అసలు అరవనేలేదు.

లోనికి ప్రవేశించడంకోసం అడ్డున్న కుక్క వైపు భయంగా చూస్తూ ద్వారంవైపు రెండడుగులు వేసాడు. పలుచని నీలిరంగు కర్టెన్‌లోంచి లీలగా కనిపించిందో స్త్రీ ఆకారం. మళ్ళీ ఒక క్షణం సంకోచం. చివరకు గెలుపు తెగింపుదే!

మెల్లిగా కర్టెన్ తొలిగించాడు. 'మే ఐ కమిన్' అన్నట్లుగా దానికున్న చిరుగజ్జెలు మ్రోగాయి. 'కమిన్' అన్నట్లుగా రెండు అందమైన కాళ్ళు టీపాయ్ మీద ఊగాయి. ఆమె దృష్టి పుస్తకం లోంచి మరలలేదు. అతనక్కడే నిలబడివున్నాడు. ఆమె చేతిలోని ఇంగ్లీషు నవల అట్ట వెనక వున్న విలన్ పిస్తోలు అతనివైపు గురిపెట్టి క్రూరంగా చూస్తున్నాడు. అతని భయాన్ని చూసేమో అన్నట్లు ముందు పేజీపైని దిగంబర యువతి విరగబడి నవ్వుతోంది. ఆమె దృష్టి ఎప్పుడు మరలుతుందా అని ఎదురుచూస్తున్నా డతను. ఆ మెకు ఇరవైయేళ్ళుండవచ్చును. శ్యామూలు శరీరఛాయ. మామూలుకు మించిన అందమైన అవయవాల పొందిక. సోఫాలోకి జారి నిర్లక్ష్యంగా కాళ్ళు టీపాయ్‌మీద పెట్టి చిన్నగా ఊపుతూ నవల చదవడంతో లీనమయింది.

ఒక క్షణం కరిగింది. ఓ పేజి తిరిగింది. కాని ఆమె దృష్టి తిరగలేదు!

పొడిగా దగ్గాడు. ఆమె వెంటనే చూడలేదు. కాసేపటి తరువాత కనులు త్రిప్పింది. "ఎవరు కావాలి?"

"నాకు... నేను రాజారావుగారి కోసం వచ్చానండి."

"నాన్నగారు కాసేపట్లో వస్తారు." మాటల్లో సౌజన్యతకన్న వ్యాపారసరళియే ఎక్కువ వినిపించింది.

ఆమె అతను కూర్చున్నాడా? లేదా? అని తిరిగిచూడలేదు. కాళ్ళను మాత్రం దించి పుస్తకంలోకి వెళ్ళిపోయింది. అతనో సోఫాలో కూర్చున్నాడు. నీలిరంగు బట్టమీద నల్ల పూసలున్న ఆ సోఫా కవరుపైనున్న తన తెల్ల పైజామా లాల్చీలపై మురికి మరకలు అసహ్యంగా కనిపిస్తున్నాయి. అతను తన పరిస్థితికి తానే సిగ్గుపడుతున్నట్లు అతని ముఖమే చెబుతున్నది. అతను తనపైనుండి దృష్టి మరల్చుకొని నలువైపులా చూస్తున్నాడు.

ఆమె పుస్తకం చదువుతూంది. అతను ఆమెను, ఆమె చుట్టువున్న వస్తువుల్ని చదువు తున్నాడు. అన్నీ ఎక్కడ వుంచవలసినవి అక్కడ అందంగా అమర్చబడి వున్నాయి. కాని అతనికి తానే అక్కడ వుండవలసినవానిగా కనుపించలేదు.

కాసేపటికి అతను ఇబ్బందిగా కదిలాడు. ఆమె తప్పనిసరై అతనివైపు అసహనంగా చూసింది.

"మీ పరిచయం తెలుసుకోవచ్చా?" వీలైనంత సౌమ్యత కనబరిచాడు.

"సరళ." ఆమె చెప్పిన సరళి సరళంగా అనిపించలేదతనికి.

"ఏం చేస్తున్నారు?" తిరిగి ప్రశ్నించాడు.

"పుస్తకం చదువుతున్నాను." ఆమె ధోరణి ప్రశ్నను అర్థంచేసుకోనట్లు గాక, నీకు చెప్పాల్సిన అవసరం లేదన్నట్లుగా కనబడింది.

"మిమ్మల్ని ఇదివరకు ఎక్కడో చూసినట్లు గుర్తు."

"ఎక్కడైనా చూసివుండవచ్చు." సంభాషణ ముగించేయాలని నిర్లక్ష్యంగా అంది.

"ఎక్కడైనా కనబడుతుంటారా ?" వ్యంగ్యం తొంగిచూసిందతని గొంతులో.

"ఏ పనీలేని జులాయి వెధవల పని అది."

"ఐతే..."

ఆమె ముఖంలో కోపం ఎర్రరంగు దాల్చింది.

"మీరు వచ్చిన పని చేసుకుని వెళ్లడం మంచిది."

"వచ్చిన పని మరిచిపోలేదు." నవ్వుతూ అన్నాడు.

ఆమె అతడివైపు చూడలేదు.

"మేడమ్ ! గొంతు ఎండుకుపోతోంది. మంచినీళ్లు ఇవ్వగలరా ?"

"నేను నౌఖర్నికాదు." తలెత్తకుండానే అంది.

"ఇంటికి వచ్చిన అతిధికోసం ఆమాత్రం చేస్తే నౌఖర్లవుతారా ?"

"అతిధులెవరో, యాచకులెవరో నాకు బాగా తెలుసు."

"తనను బిచ్చగాడంటావుంది." మనసులో అనుకున్నాడు.

"నిజమేనండీ ! కార్యార్థియై వచ్చినవాడు యాచకుడే అవుతాడు. సెలవండీ ! రాజారావుగారిని మరోసారి కలుస్తాను." తను వచ్చిన పని ఐపోయిందనిపించి, లేచి నిలబడ్డాడు.

ఇంతలో లోపలనుండి రాజారావు డ్రాయింగ్ రూమ్‌లోకి వస్తూనే గడియారంవైపు ఒకసారి చూసి ఆమెవైపు తృప్తిగా చూసాడు.

రాజారావును చూడగానే తొట్రుపాటుతో నమస్కరించాడా యువకుడు.

రాజారావు అతనివైపోసారి చూసి ప్రతి నమస్కారం చేయక, తలూపి కూర్చున్నాడు.

అతడు వినయంగా చేతులు కట్టుకుని "నా పేరు రవి. మీరు ఇంటర్వ్యూ చేసిన అభ్యర్థులలో నేనొక్కడిని..." అతని గొంతు వణికింది.

"ఇంకా సెలక్షన్స్ కాలేదు."

"అందుకే తమ దగ్గరకు వచ్చాను."

"ఇదివరకే నిర్ణయం జరిగిపోయింది. ఇప్పుడేమీ ప్రయోజనంలేదు." పెదవి విరుస్తూ అన్నాడు రాజారావు.

"సార్ ! నేను బి. ఏ. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. ఇంటర్వ్యూకు వచ్చిన అభ్యర్థులలో నావే ఎక్కువ మార్కులు. నేను చాల బీదవాణ్ణి. నాకు న్యాయం చేకూర్చండి."

రాజారావు గలగల నవ్వాడు. "రాత్రింబవళ్ళు అనవసరంగా కష్టపడి చదివావు ! ఆ కష్టంతో డబ్బు సంపాదిస్తే యీ ఉద్యోగం దొరికేదేమో ! చూడు మిస్టర్ ! నువ్వు ఎలిజిబిల్ క్యాండిడేటువే కావచ్చుకాని లాభంలేదు. కనీసం మూడువేలైనా ముట్టచెప్పితే నీకోసం ప్రయత్నం చేయగలను."

'ఈ మూడువేలతో సరళ పెళ్లికి మరో షామియానో, విలువైన బ్యాండునో తెప్పించవచ్చు.' అనుకున్నాడు రాజారావు.

"సార్ ! న్యాయంగా నాకొచ్చే ఉద్యోగంకోసం నేను డబ్బివ్వడం అన్యాయం ! మేడమ్ మీరైనా చెప్పండి !" జాలిగా అన్నాడు.

ఆమె ముఖం తిప్పుకుంది. తిప్పుకుని తండ్రి వంక ముసిముసిగా నవ్వింది. నవ్వి, "ఈయనగారికి నేను మంచినీళ్ళు తెచ్చి ఇవ్వాలట ! నాయింట్లో పెళ్లికొడుకుల హోదాలో వచ్చేవారికే నౌకర్లు తెచ్చిస్తారు." కోపంగా అంది.

రాజారవులోని ప్రసన్నత కరిగిపోయింది. "నేను చెప్పాల్సింది చెప్పేశాను. మూడువేలు తెగలిగితేనే మరోసారి ఇక్కడికి రా ! వెళ్ళు." తాను లేస్తూ అన్నాడు.

"సార్..." రవి ఏదో అనబోయాడు.

"మిస్టర్ ! ఇప్పుడు మా అతిధులు వస్తారు. వారి ముందు నువ్వుండడం నాకిష్టంలేదు. కాబట్టి యిక్కడనుండి వెంటనే వెళ్లిపో !" అసహనంగా అన్నాడు.

"వెళుతున్నాను సార్ ! కాని ఒక విషయం గుర్తుంచుకోండి. మేలు చేసినవాడికే మేలు జరుగుతుంది !" అని గిరుక్కున వెనక్కుతిరిగాడు.

అతను నిర్వికారంగా ఆ యిల్లును దాటి నడిచిపోతున్నాడు. అతని కళ్ళలో యిదివరకున్న దీనత్వం లేదు.

అతని కళ్లు ఇప్పుడు చురుక్కా నేలా చూస్తున్నాయి. కాళ్ళిప్పుడు చురుగ్గా నడుస్తున్నాయి.

కొంతదూరం పోయాక ఓ టాక్సీని ఆపి ఎక్కి కూర్చున్నాడు. అది చిక్కుబడిన దారంలా వున్న ట్రాఫిక్‌లోంచి హోటల్ 'స్వాగత్' దిక్కు జారిపోతున్నది.

వెనకసీట్లో జారగిలబడి సిగరెట్ వెలిగించి ఆలోచిస్తున్నాడు — ఇంతవరకు రవిలా నటించిన వేణు. 'నేనెంత బాగా నటించాను. అవును. వేణు — పెళ్లికొడుకు హోదాలో వెళితే వాళ్ళ గుణగణాలను అంచనా వేయగలిగేవాడినేనా ? లేదు. రవి — నిరుద్యోగిగా వెళ్లి తెలుసుకున్న వారి మనస్తత్వంలో వెయ్యవవంతుకూడ తెలుసుకోలేక పోదును. ఈ విషయంలో నిజంగా రవి యిచ్చిన సలహాకు థాంక్సు ! నిజంగా యిది దైవఘటనే ! తాను రవి ఇద్దరు కలసి ఒకేసారి ఇక్కడకు రావడం, తాను పెళ్లిచూపులకు వెళుతున్న అమ్మాయి తండ్రి రాజారావుగారే రవికి ఇంటర్వ్యూ చేసిన ఆఫీసరు కావడం గమ్మత్తే !

అమ్మ బలవంతంమీద, 'వాళ్లకు నువ్వు టూర్‌లో ఆవూరికి వస్తున్నట్లు — అమ్మాయిని చూస్తాడని రాసాను. వెళ్లకపోతే బాగుండ'దని పట్టుబడితే వచ్చాడు. కాని తనకే అమ్మాయిని చూడటం యిష్టంలేదు. అందుకు కారణం లేకపోలేదు. అతనికి, తనకు కాబోయే జీవిత భాగస్వామినిని గూర్చి కొన్ని అభిప్రాయాలున్నాయి. ఆమె సౌజన్యమూర్తిగా, సున్నితమైన హృదయంతో, ఆప్యాయత, అనురాగాలు మూర్తీభవించిన స్త్రీమూర్తిగా వుండాలి. స్వశక్తితో ఒక వ్యక్తిగా నిలబడ్డ తనను, తన కుటుంబ సభ్యులను అభిమానించి, ప్రేమించే వ్యక్తి కావాలి. అలాంటి వ్యక్తిని పెళ్లిచూపుల మిషతో ఆ నాలుగైదు నిమిషాల్లో ఎలా అంచనావేయాలి ?

నిజంగా ఉద్యోగలకోసం చేసే ఇంటర్వ్యూలు, పెళ్లిచూపుల నిమిత్తం జరిగే ఇంటర్వ్యూలు జరిగే నాలుగైదు నిముషాల్లో వ్యక్తియొక్క అసలు ప్రతిభ, గుణం తెలుస్తుందా? లేదు. అలాంటప్పుడు యీ ఇంటర్వ్యూ లెందుకు ? లంచం డబ్బుతో ఉద్యోగాలు కొనడం, కట్నం డబ్బుతో వరులను కొనడం, అమ్ముడుపోవడం చాల నీచం.

"స్వాగత్ వచ్చేసింది సార్ !" అన్న టాక్సీ డ్రైవరు పిలుపుతో స్వగతంలోంచి ప్రస్తుతానికి వచ్చాడు వేణు. మీటర్ డబ్బు చెల్లించి రూమ్‌లోకి వెళ్లేసరికి రవి, వేణు కోసమే ఎదురు చూస్తున్నట్లు కూర్చున్నాడు.

"ఎలా జరిగింది ఇంటర్వ్యూ ?" ఆత్రంగా ప్రశ్నించాడు రవి.

జరిగిన సంగతి క్లుప్తంగా చెప్పాడు వేణు.

"నిజంగా నువు గొప్ప నటుడివోయ్ ! కాలేజి నాటకాల్లో నాకు ప్రథమ బహుమతి, నీకు ద్వితీయ బహుమతి వచ్చింది గాని — ప్రథమ బహుమతి నీకు రావాల్సింది !" మెచ్చుకోలుగా అన్నాడు.

వేణు సన్నగా నవ్వి ఊరుకున్నాడు.

* * *

అక్కడ రాజారావుగారు అతని కూతురు డ్రాయింగ్ రూంలో కూర్చొని పెళ్లికొడుకు కొరకు ఎదురుచూస్తూ, 'పెళ్లికుమారున్ని ఎలా ట్రాప్ చేయాలి ? ఎన్ని షామియానాలు వేయించాలి ?' అని ఆలోచిస్తున్నారు.

నిరుద్యోగి చూపులు

చూస్తాడు, ఎదురు చూస్తాడు నిరుద్యోగి
న్యూస్‌పేపర్ కోసం
అంతకన్నా ఆత్రంతో చూస్తాడు వాంటెడ్ కాలమ్స్
కనపడ్డదానికల్లా చేస్తాడు అప్లై
ఆశ చూపుతూ వస్తుంది ఇంటర్వ్యూ
ఇంట్లోవారిని బాధపెట్టి సంపాదిస్తాడు
నాలుగు డబ్బులు
లేకపోతే చేస్తాడు స్నేహితుని దగ్గర అప్పులు
ఆ ముహూర్తానికి వెళ్తాడు యథాప్రకారంగా
తన పిలుపు కోసం కాస్తాడు పడిగావులు
ప్యూన్ కేక విని వెళ్తాడు నీరసంగా
అడిగినదానికి చెప్తాడు ఉషారుగా
ఇంటి మొఖం పడ్తాడు సంతృప్తిగా
వింటాడు నాలుగు రోజులకి తోటి నిరుద్యోగి దగ్గర
ఆ పోస్ట్ రికమండేషన్ కాండిడేట్
తన్నుకుపోయాడని
పడతాడు నిరుత్సాహం ఎప్పటివలె
విరక్తితో చూస్తాడు రేపటి న్యూస్‌పేపర్ కోసం.

— తలశిల రామకృష్ణ